# వరదలతో బ్రెజిల్ అతలాకుతలం 90 మంది మృతి



**బ్రసిలియా :** దక్షిణ వర్షాలు, భారీ వరదల కారణంగా బ్రెజిల్ దేశం వారం రోజులుగా అతలాకుతలం అవుతోంది. దక్షిణ అమెరికాలాటిన్ అమెరికాలలో విస్తరించి ఉన్న ఐదవ అతిపెద్ద దేశం బ్రెజిల్‌ను గత చరిత్రలో లేనిరీతిలో భారీ వరదలు చుట్టుముట్టాయి. ఈ వరదల కారణంగా దేశంలో 90 మంది మరణించారు. మరో 130 మంది గల్లంతయ్యారు. వీధుల్లో కార్లు బదులుగా పడవలు తిరుగాడుతున్నాయి. దక్షిణ బ్రెజిల్‌లో లక్షా 50 వేల మంది ప్రజలు ఈ భారీ వర్షాల కారణంగా నిరాశ్రయులయ్యారు. అనేక ప్రాంతాలలో చిన్న చిన్న కుటుంబాలు సర్వ కోల్పోయాయి. ఎంతో కష్టపడి సమకూర్చు కున్న మౌలిక సౌకర్యాలను, ధనాన్ని ఈ వరదల్లో పోగొట్టుకున్నామని కుటుంబాలు వీధుల్లో తిరుగుతూ రోదిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. వీధులన్నీ పూర్తిగా నీటితో నిండిపోయాయి. కార్లు తిరుగాడే రోడ్లపై ప్రభుత్వం వారం రోజులుగా పడవలను రంగంలోకి దించింది. వరదల ప్రభావం వల్ల సహాయ కార్యక్రమాలకు తీవ్ర ఆటంకం వస్తోందనీ, ప్రజలు సహనంతో ఉండాలని ప్రభుత్వం కోరింది. దక్షిణ బ్రెజిల్ అంతటా ఎక్కడా చూసినా శాటిలైట్ పిక్చర్స్‌లో వరదనీరే కనిపిస్తున్నది. రియో గ్రాండ్ డో సల్ రాష్ట్రం ఈ వరదల కారణంగా అందరికంటే చాలా ఎక్కువగా నష్టపోయింది. రాష్ట్రరాజధాని పోర్టో అలెగ్రే నగరానికి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, రోడ్లు అనీ పీకలోతు నీట మునిగాయి. వరదల్లో చిక్కుకున్న వారిని బయలకు తీసుకువచ్చేందుకు సహాయ బృందాలు నిరంతరాయంగా శ్రమిస్తున్నాయి. హెలికాప్టర్లను రంగంలోకి దించారు. వరదల్లోంచి బయటపడిన ప్రజలు సర్వం కోల్పోయి సురక్షిత ప్రాంతాలకు వచ్చి రోడ్ల పక్కనే నిద్రిస్తున్నారు. కొందరు తమ కార్లను ఇళ్ళుగా మార్చుకుని రోడ్లపక్కనే ఉంటున్నారు.

# నెదర్లాండ్స్‌కు వ్యాపించిన నిరసనలు




**ఆమ్‌స్టర్‌డామ్ :** నెదర్లాండ్ రాజధాని ఆమ్‌స్టర్‌డ్యామ్ యూనివర్సిటీకి పాలస్తినా అనుకూల ప్రదర్శనలు వ్యాపించాయి. ఆమ్‌స్టర్‌డ్యామ్ విశ్వవిద్యాలయంలో వందలాదిమంది విద్యార్థులు బుధవారంనాడు నిరసన ప్రదర్శనలు జరిపారు. పాలస్తినా ప్రజలపై యుద్ధం ఆపాలని, వారి మానవహక్కులు కాపాడాలని, ఇజ్రాయిల్‌ను యుద్ధ నేరస్తురాలుగా నిలబెట్టాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. పోలీసులు రంగ ప్రవేశం చేసి విద్యార్థులను చెదరగొట్టే ప్రయత్నం చేశారు. తాజాగా బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ, అమెరికా చికాగో యూనివర్సిటీలో కూడా వందలాదిమంది విద్యార్థులు పాలస్తినాకు సంఘీభావంగా నిరసన ప్రదర్శనలు కొనసాగిస్తున్నారు. బెర్లిన్ విశ్వవిద్యాలయంలో పాలస్తినా అనుకూల విద్యార్థులు పోలీసులపై తిరగబడ్డారు. పోలీసులు, విద్యార్థుల మధ్య ఘర్షణ జరిగింది. ఇదిలా ఉండగా అమెరికా వాషింగ్టన్ డిసిలో ఉన్న జార్జ్ వాషింగ్టన్ యూనివర్సిటీలో పాలస్తినా అనుకూల ప్రదర్శకులు వేసుకున్న గుడారాలను బుధవారం పోలీసులు తొలగించారు. వారిని యూనివర్సిటీ ఆవరణ నుండి బలప్రయోగంతో తరిమికొట్టారు. దాంతో నిరసన ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు యూనివర్సిటీ అధ్యక్షుడు ఎల్లెన్ గ్రాన్‌బెర్గ్ నివాసం వద్దకు వెళ్ళి నిరసన తెలియజేశారు. ఐతే విద్యార్థుల హక్కుల రక్షణకు యూనివర్సిటీ కట్టుబడి ఉందని యాజమాన్యం చెబుతున్నది. పాలస్తినాను విముక్తి చేయండి అని విద్యార్థులు నినాదాలు చేశారు. ఏప్రిల్ 18 నుండి అమెరికాలోని 50 విశ్వవిద్యాలయాలలో పాలస్తినా అనుకూల నిరసన ప్రదర్శనలు చెలరేగాయి. సుమారు 2,600 మంది పైగా విద్యార్థులను పోలీసులు అరెస్టు చేసినట్లు లా ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజన్సీ వెల్లడించింది.

# రఫా క్రాసింగ్ ముట్టడిపై అమెరికా ద్వంద్వ వైఖరి

**టెల్‌అవీవ్ :** రఫాపై పూర్తిస్థాయి దాడికి సన్నద్ధమవుతున్న ఇజ్రాయిల్ విషయంలో అమెరికా రెండు నాల్కల ధోరణి ప్రదర్శిస్తున్నది. రఫా సరిహద్దుల్లో ఉన్న ప్రధాన రహదారిని ఇజ్రాయిల్ సైన్యం (ఐడిఎఫ్) స్వాధీనం చేసుకోవడాన్ని అమెరికా చిన్న విషయంగా చెబుతున్నది. తూర్పు రఫా నుండి ఖాళీచేయాలనని లక్షమంది పాలస్తీనియన్లకు ఐడిఎఫ్ గడచిన సోమవారమే హుకుం జారీ చేసింది. రఫాలో 15 లక్షమంది పాలస్తీనియన్ల రక్షణపై ఐక్యరాజ్యసమితి, యూనిసెఫ్ సహా పలు దేశాలు ఆందోళన వ్యక్తం చేస్తుండగా, ఇజ్రాయిల్‌కు తాత్కాలికంగా ఆయుధ సరఫరా ఆపేస్తామని అమెరికా ఒకవైపు ప్రకటిస్తూ, మరోవైపు మాత్రం, రఫా క్రాసింగ్ స్వాధీన చర్య పరిమితస్థాయిలో జరిగే సైనిక చర్యే అని సమర్థిస్తున్నది. ఈజిప్టు వైపు నుండి రఫా క్రాసింగ్‌ను, ఇజ్రాయిల్ వైపు నుండి ప్రధాన మార్గమైన కెరెమ్ షాలోమ్ ద్వారా గాజాలోకి సహాయం నిలిపివేసి పూర్తిస్థాయి దాడి చేస్తే భయంకరమైన కరువు, ఆహార కొరత వస్తుందని ఐక్యరాజ్యసమితి హెచ్చరిస్తున్నది. ఈ నేపథ్యంలో గాజా–ఈజిప్టు సరిహద్దు వెంబడి తూర్పు రఫాపై సైనిక చర్య పూర్తిస్థాయి దాడి కాదని వైట్‌హౌస్ జాతీయ భద్రతా మండలి అధికార ప్రతినిధి జాన్ కిర్బీ ఇజ్రాయిల్ చర్యను సమర్థించారు. అదేసమయంలో, ఇజ్రాయిల్‌కు తాత్కాలికంగా ఆయుధ సరఫరాకు విరామం ఇవ్వాలని అమెరికా నిర్ణయించడం కంటి తుడుపు చర్యగా మారింది. 1800 2,000 పౌండ్ల బాంబులు ఈ షిప్‌మెంట్‌లో ఉంటాయని అంచనా వేస్తున్నారు. రఫా సరిహద్దుల్లో యుద్ధ టాంకులను ఇజ్రాయిల్ మోహరించడంతో బైడెన్ ఈ నిర్ణయానికి వచ్చారు. ఎగుమతి కొనసాగింపు చాలా వద్దా అనే విషయంపై అమెరికా విదేశాంగ శాఖ పరిశీలన చేస్తున్నది. అంతర్జాతీయస్థాయిలో ఇంటా బయటా తీవ్ర ఒత్తిడికి గురవుతున్న అమెరికా చివరకు ఇజ్రాయిల్‌ను నియంత్రించేందుకు బాహాటంగా ప్రకటనలు చేయక తప్పలేదు. అమెరికా చేస్తున్న బెదిరింపులను ఇజ్రాయిల్ లెక్కచేయకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో ఆయుధాల సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయాలని అమెరికా ఆలోచనలో పడింది. రఫాలో మూడు బెటాలియన్ల హమాస్ ఉగ్రవాదులు తలదాచుకున్నారని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ సహా ఐడిఎఫ్ వార్ రూమ్ గట్టి అభిప్రాయంతో ఉంది. రఫాలో సామాన్య ప్రజలను అడ్డం పెట్టుకుని హమాస్ ఉగ్రవాదులు చిట్ట చివరి ఆశ్రయంగా సురక్షితంగా ఉన్నారనీ, కైరోలో ఒప్పందంతో సంబంధం లేకుండా వారిని మట్టుపెట్టడమే తమ లక్ష్యమని ఇజ్రాయిల్ ప్రధానమంత్రి నేతన్యాహూ పదే పదే ప్రకటిస్తున్నారు.





## ఇజ్రాయిల్‌పై ఒత్తిడి చేయండి ప్రపంచదేశాలకు హమాస్ పిలుపు

కాగా ఈజిప్టు, ఖతార్ మధ్యవర్తిత్వంలో కైరోలో కొనసాగున్న చర్చలు బుధవారం తిరిగి ప్రారంభమయ్యాయి. రఫా క్రాసింగ్‌ను ఇజ్రాయిల్ ముట్టడించడంతో గాజా లోపలికి ఆహార సరఫరా ఆగిపోయింది. ఒకవైపు రఫాపై యుద్ధ సన్నాహాలు చేస్తూనే కెరెమ్ షాలోం నుండి పరిమితస్థాయిలో గాజా లోకి నిత్యావసరాలు తీసుకువెళ్ళేందుకు ఇజ్రాయిల్ బుధవారం దారి వదిలింది. రఫా సరిహద్దుల్లో ఆయుధాలను మోహరించడంతో హమాస్ కూడా వెనక్కు తగ్గింది. కైరో చర్చల ప్రతిపాదనల మేరకు బందీల విడుదలకు అంగీకరించింది. కానీ ఏ క్షణంలోనైనా రఫాపై దాడికి రంగం సిద్ధం కావడంతో మరో మానవ విలయం జరగకుండా అడ్డుకోవాలని, ఇజ్రాయిల్ దుశ్చర్యలు ఆపాలని ఆ దేశంపై ఒత్తిడి తీసుకురావాలని హమాస్ నాయకత్వం ప్రపంచ దేశాలకు పిలుపు ఇచ్చింది.

# రణరంగంగా మారిన లాహోర్ హైకోర్టు

## లాయర్లు – పోలీస్ ఘర్షణ, అరెస్టులు



**లాహోర్ :** పాకిస్థాన్ లాహోర్ నగర హైకోర్టు బుధవారం రణరంగంగా మారింది. న్యాయవాదులు లాహోర్ హైకోర్టు ఆవరణలోకి ప్రవేశించేందుకు ప్రయత్నించారు. దాంతో పోలీసులు, న్యాయవాదులమధ్య ఘర్షణ చెలరేగింది. ఈ ఘర్షణలో అనేకమంది న్యాయవాదులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు రెచ్చిపోయి న్యాయవాదులపై బలప్రయోగం చేశారు. వారిపై నీటి గొట్టాలతో దాడి చేశారు. లాఠీచార్జితోపాటు బాష్పవాయు ప్రయోగం చేశారు. వారితోపాటు పోలీసులు, పత్రికా విలేకరులు, దారిన పోయే సామాన్య ప్రజలు కూడా గాయపడ్డారు. ఈ ఘటనవల్ల డజన్ల సంఖ్యలో న్యాయవాదులను పోలీసులు అరెస్టు చేశారు. కొంతమంది న్యాయవాదులపై పోలీసులు ఉగ్రవాద కేసులు పెట్టడంతో ఈ వివాదం మొదలైంది. ఈ కేసులు రద్దు చేయాలంటూ న్యాయవాదులు డిమాండ్ చేస్తూ లాహోర్ హైకోర్టు బార్ అసోసియేషన్ (ఎల్‌హెచ్‌సిబిఎ) ఆధ్వర్యంలో పెద్ద నిరసన ర్యాలీ చేశారు. దీంతోపాటు లాహోర్ హైకోర్టును ఉన్నచోటు నుండి మరో ప్రాంతానికి తరలించవద్దని కూడా డిమాండ్ చేస్తూ న్యాయవాదులు నిరసన ప్రదర్శన చేస్తూ హైకోర్టు ఆవరణలోకి ప్రవేశించే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దాంతో పరిస్థితి అదుపు తప్పి హింస చెలరేగింది. వారి మధ్య ఘర్షణతో ఆ ప్రాంతం రణ రంగంగా మారింది. ఐతే పోలీసులు–న్యాయవాదుల మధ్య చర్చలు జరుగుతన్నప్పటికీ ఆ చర్యలు బుధవారం సాయంత్రం వరకూ ఓ కొలిక్కి రాలేదు. తమ డిమాండ్లు నెరవేరేవరకూ ఆందోళన కొనసాగుతుందని (ఎల్‌హెచ్‌సిబిఎ అధ్యక్షుడు అసద్ బట్ చెప్పారు. పోలీసుల దుశ్చర్యపై పాకిస్థాన్ సుప్రీంకోర్టుబార్ అసోసియేషన్ కూడా తీవ్రంగా స్పందించింది. ఘటనను ఖండించింది. తక్షణం ప్రధాన న్యాయమూర్తి తనకు తానుగా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరింది. కాగా పంజాబ్ ముఖ్యమంత్రి మర్యం షరీఫ్ ఈ ఘటనపై ఒక ప్రకటన చేస్తూ, న్యాయవాదులపై బల ప్రయోగం చేయవద్దనిఆదేశించానన్నారు.

కాగా పాకిస్థాన్ బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు రియాజత్ అలీ కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండించారు.

# స్కాట్‌లాండ్ ప్రధానమంత్రిగా వృద్ధనేత స్విన్నీ



**ఎడింబర్గ్ :** అవిశ్వాస తీర్మానానికి ముందుగానే ఓటమికి భయపడి యువ నాయకుడు యూసుఫ్ స్కాట్‌లాండ్ దేశ నాయకత్వానికి రాజీనామా చేయడంతో తలపండిన వృద్ధ నాయకుడు జాన్ స్విన్నీ (60)ని ఆ బాధ్యతలు వరించాయి. యువనాయకుడు హమ్జా యూసఫ్ (39) పదవికి రాజీనామా చేయడంతో రాజకీయాల్లో విజయవంతమైన నాయకుడు సిన్నీని స్కాట్‌లాండ్ పార్లమెంటు ప్రధానమంత్రిగా (ఫస్ట్‌మినిస్టర్)గా ఎన్నుకుంది. స్కాట్‌లాండ్ పార్లమెంటులో 64 మంది సభ్యులు ఆయనకు అనుకూలంగా ఓటు వేయగా ఆయన సమీప ప్రత్యర్థి స్కాటిష్ కన్జర్వేటివ్ పార్టీ నాయకుడు డౌగ్లస్ రోస్‌కు 31 ఓట్లు లభించాయి. ఏకాభిప్రాయంతో పార్లమెంటు ఆయనకు ఫస్ట్ మినిస్టర్‌గా పట్టం కట్టింది. ఆయన గతంలో 2000–2004 మధ్య కాలంలో స్కాటిష్ నేషనల్ పార్టీ (ఎస్‌ఎన్‌పి) తరపున అధికారం నిర్వహించిన అనుభవం ఉంది. రాజకీయంగా తీవ్ర విభజనలు వచ్చిన పరిస్థితుల్లో అటు పార్టీని, ఇటు దేశాన్ని తిరిగి స్విన్నీ మాత్రమే ఓ కొలిక్కి తీసుకురాగలరని పార్లమెంటు సభ్యులు ఏకాభిప్రాయం వ్యక్తం చేశారు. సోమవారం ఈ ఎన్నికల పూర్తయిన తర్వాత స్విన్నీ పాత్రికేయులతో మాట్లాడుతూ ఈ వయసులో ఇది తనకు ఒక అసాధారణమైన అవకాశమని అన్నారు. గ్రేట్ బ్రిటన్‌లో ఉత్తర దీవుల ప్రాంతం స్కాట్‌లాండ్. వాతావరణ విధానంపై ఎస్‌ఎన్‌పి పార్టీ సారథ్యంలోని కూటమిలో స్కాటిష్ గ్రీన్ పార్టీతో వచ్చిన విభేదాల కారణంగా యూసుఫ్ రాజీనామా చేశారు.

## బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు (3వ పేజీ తరువాయి)

రేవంత్ రెడ్డే తెలంగాణ సిఎంగా ఉంటారని ఆయన తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తనలాంటి సీనియర్స్ అంతా రేవంత్ రెడ్డికి సహకరిస్తూ మంచి టీంవర్క్ చేస్తున్నామని ఆయన వెల్లడించారు. తనకు ముఖ్యమంత్రి లాంటి పెద్ద పదవులపై ఆశ లేదని రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని గౌరవిస్తూ పనిచేస్తున్నాని మంత్రి కోమటిరెడ్డి స్పష్టం చేశారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డిలాగా సిఎం రేవంత్ రెడ్డి కూడా చాలా స్వేచ్ఛ ఇస్తున్నారని అన్నారు. ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల్లో ఎన్‌డియే కూటమి ఓటమి లక్ష్యంగా పనిచేస్తున్నామని, తెలంగాణలో పక్కాగా 14 సీట్లను కాంగ్రెస్ కైవసం చేసుకుంటుందని ఆయన చెప్పారు. డీలిమిటేషన్ లో రాష్ట్రంలో అసెంబ్లీ స్థానాల సంఖ్య 154కి పెరగనున్నాయని, అందులో 125 చోట్ల కాంగ్రెస్ పార్టీ గెలుస్తుందని ఆయన తెలిపారు.

**కెసిఆర్ చచ్చినపాము లాంటోడు ....**పార్లమెంట్ ఎన్నికల్లో కనీసం రెండు స్థానాల్లోనైనా డిపాజిట్లు దక్కించుకునేందుకు కెసిఆర్ బస్సు యాత్ర చేస్తున్నారని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా చేశారు. కెసిఆర్ చచ్చినపాము లాంటోడని, బిఆర్ఎస్ కు ఒక్క ఎంపి సీటు కూడా దక్కదన్నారు. తెలంగాణ ఉద్యమంలో దొంగదీక్షలు చేసిన చరిత్ర కెసిఆర్ ది అని ఆయన మండిపడ్డారు. లిక్కర్ స్కామ్ లో ఢిల్లీ జైలులో ఉన్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వలన తెలంగాణ రాష్ట్ర పరువు పోయిందన్నారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కెసిఆర్ కూతురు అని చెప్పుకోవడం ఎలా ఉంటుందో ఆమెనే సమాధానం ఇవ్వాలన్నారు. కెసిఆర్ హాయంలో జరిగిన ఫోన్ ట్యాపింగ్ కేసు, కాళేశ్వరం ఎత్తిపోతల అవకతవకలు సహా అన్ని అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తున్నామని ఆయన చెప్పారు. సీనియర్ ఐఎఎస్ సోమేష్ కుమార్ లాంటి అవినీతి అధికారిని రియల్ ఎస్టేట్ బ్రోకర్ గా మార్చి రాష్ట్రంలోని 100 ఐఎఎస్ అధికారులకు పనిలేకుండా కెసిఆర్ చేశారని ఆయన దుయ్యబట్టారు. రేవంత్ రెడ్డి ప్రతిరోజు సెక్రటేరియట్ కు వచ్చి మొత్తం పరిపాలన వ్యవస్థను చక్కబెట్టారని చెప్పారు. ధనిక రాష్ట్రాన్ని కెసిఆర్ రూ.7 లక్షల కోట్ల అప్పుల్లో ముంచారని, తాము అధికారంలోకి వచ్చాక చాలవరకు దుబారా ఖర్చును తగ్గించామన్నారు. మొత్తం అన్ని వ్యవస్థలను గాడిలో పెడుతున్నామని , రాష్ట్ర అభివృద్ధి కోసం మంచి ప్రణాళిక రూపొందించి ముందుకు పోతున్నామని చెప్పారు. మూసీ నది ఆధునీకరణ కోసం సుమారు రూ. 50 కోట్ల నిధులను ఖర్చు పెట్టబోతున్నామని చెప్పారు. మూసీనదిలోకి 5 టీఎంసీల గోదావరి నీటి తరలించి, ఆ నదిపై మధ్యలో వంతెనలను నిర్మిస్తామన్నారు. 5 లక్షల మందికి ఇందిరమ్మ ఇల్లు కట్టించబోతున్నామని చెప్పారు. లోక్ సభ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే అకాల వర్షాలకు తడిచిన ధాన్యంను కొనుగోలు చేయల్సిందిగా కలెక్టర్లకు ఉత్తర్వులు జారీ చేశామన్నారు. పంద్రాగస్టు నాటికి రైతు రుణ మాఫీ చేస్తామని ఆయన హామీ ఇచ్చారు.

**డబుల్ ఆర్ఆర్ కాదు డబుల్ ఏఏ:** బిజెపి నేతలు ఆరోపిస్తున్నట్లుగా తెలంగాణలో డబుల్ ఆర్ఆర్ ట్యాక్స్ లేదని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. కేంద్రంలోని మోడీ సర్కార్ డబుల్ ఏఏలకు దోచిపెడుతుందని ఆయన మండిపడ్డారు. డబుల్ ఏఏ అంటే అదానీ,అంబానీ అని వివరించారు. 2013 దేశం రూపురేఖలు మార్చేస్తామని 500 సభలలో మోడీ చెప్పారని ఆయన గుర్తు చేశారు. దేశ జనాభాలో 25 కోట్లు ఉన్న ముస్లింల రిజర్వేషన్లు తొలగిస్తామని ప్రచారం చేస్తూ మత కలహాలను సృష్టిస్తున్నారని ఆయన ఆరోపించారు.

## పుట్టెడు దుఃఖం

(3వ పేజీ తరువాయి)

రోజులు క్రితమే కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకువచ్చినా తేమ పేరుతో అధికారులు వడ్లను కొనలేదని వాపోతున్నారు. ఎండల తీవ్రతను బట్టి ఎప్పుడైన అకాల వర్షం కురిసే అవకాశం ఉందని, తమ పంటను వెంటనే కొనుగోళ్లు చేయాలని తమ అనుభవంతో అధికారులకు పదే పదే విన్నవించినా పట్టించుకోలేదన్నారు. మరో 6 రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారులు ప్రకటించిన నేపథ్యంలో మళ్లీ గాలి వానలు వస్తే తమ పరిస్థితి ఏమిటాని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యాన్ని అధికారులు వెంటనే కొనుగోలు చేసి మమ్మల్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

# నేటి నుండి జూనియర్ కళాశాలల్లో అడ్మిషన్లు



**ప్రజాపక్షం/హైదరాబాద్:**రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ జూనియర్ కళాశాలలో గురువారం నుండి తొలి దశ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ నెల 31 వరకు దరఖాస్తులను స్వీకరిస్తారు. జూన్ 1న ఇంటర్ తరగతులు ప్రారంభంకానున్నాయి. ఈ మేరకు ఇంటర్మీడియట్ బోర్డ్ '2024 25' విద్యా సంవత్సరానికి గాను 'అడ్మిషన్ షెడ్యూల్'ను బుధవారం విడుదల చేసింది. పదో తరగతిలో వచ్చిన జిపిఎ ఆధారంగా ఇంటర్ ప్రవేశాలను కల్పించనున్నారు. ప్రవేశ పరీక్షల ద్వారా అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహిస్తే సదరు ఇంటర్ కళాశాలలపై చర్యలు తీసుకుంటామని ఇంటర్మీడియట్ బోర్డ్ హెచ్చరించింది. అడ్మిషన్ల కోసం దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఇంటర్‌నెట్ మార్కుల మెమోను, ఆధార్ కార్డు తప్పని సరిగా దరఖాస్తుతో జత చేయాలి..అడ్మిషన్ పూర్తయిన తర్వాత ఒరిజినల్ మెమోతో పాటు టిసి సమర్పించాల్సి ఉంటుంది. కాగా ఒక్కో సెక్షన్‌లో 88 మందికి మాత్రమే అడ్మిషన్లు ఇవ్వాలని, ఇంటర్ బోర్డ్ మంజూరు చేసిన సీట్ల సంఖ్యను సూచిక బోర్డ్‌లో పొందపర్చాలని ఇంటర్‌బోర్డ్ స్పష్టం చేసింది. అడ్మిషన్లలో రిజర్వేషన్లను పాటించాలని ఆదేశించింది. ఇంటర్ అడ్మిషన్లలో ఎస్‌సిలకు 15 శాతం, ఎస్‌టిలకు 10శాతం, బిసిలకు 29 శాతం(ఎ7,బి10,ఇ1,డి7,ఇ4 శాతం), వికలాంగులకు 5 శాతం, ఎన్‌సిసి,స్పోర్ట్స్ 5 శాతం, ఎక్స్ సర్వీస్ మెన్, డిఫెన్స్ 3 శాతం, ఆర్థికంగా వెనుకబడిన తరగతులు(ఇడబ్ల్యుసి) 10 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని ఇంటర్మీడియట్ బోర్డ్ వెల్లడించింది. ప్రభుత్వ, ప్రైవేటు,ఎయిడెడ్‌తో పాటు గురుకులాలు, కెజిబివి, మాడల్ జూనియర్,టిఎంఆర్‌జెసి తదితర కళాశాలలో అడ్మిషన్లను స్వీకరించనున్నారు.

| | |
|---|---|
| **అడ్మిషన్ల ప్రారంభం,దరఖాస్తుల స్వీకరణ** | **: మే 9** |
| **అడ్మిషన్ల ప్రక్రియ ముగింపు** | **: మే 30** |
| **తరగతులు ప్రారంభం** | **: జూన్ 1న** |
| **మొదటి దశ అడ్మిషన్ల పక్రియ పూర్తి** | **: జూన్ 30** |

## పౌర సరఫరాల శాఖ

(3వ పేజీ తరువాయి)

స్వయంగా రంగంలోకి దిగారు. బుధవారం ఆయన సిద్దిపేట జిల్లా కొమ్మురవెల్లిలోని పీపీసీ కేంద్రాలను సందర్శించి తడిసిన ధాన్యాన్ని పరిశీలించారు. అంతేకాకుండా అక్కడ ప్రైవేట్ భూముల్లో ఏర్పాటు చేసిన కొన్ని పీపీసీ కేంద్రాలు రైతుల నుంచి భూ యజమానులు అద్దె వసూలు చేస్తున్నా విషయాన్ని గమనించిన కమిషనర్ వెంటనే ఐకేపీ కేంద్రాల సొసైటీ కమీషన్ నుంచి పిసిసిల అద్దె చెల్లించాలని జాయింట్ కలెక్టరు ఆదేశించారు.ఇటీవల కురిసిన అకాల వర్షాల కారణంగా తడిసిన వరి ధాన్యాన్ని కొనుగోలు చేయడంద్వారాఅవసరమైన సహాయాన్ని అందించి, తద్వారా రైతుల ప్రయోజనాలను పరిరక్షించడంలో పౌరసరఫరాల శాఖ పూర్తి నిబద్ధతతో ఉందన్నారు. రైతుల సంక్షేమమే ప్రధానమని, వారికి మద్దతుగా ప్రభుత్వం పలు చర్యలు చేపట్టిందని చెప్పారు.తడిసిన ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని, పీపీసీల వద్దకు వచ్చిన ప్రతి వరి ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉన్నామని పునరుద్ఘాటించారు. రైతులు భయపడాల్సిన పనిలేదని ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల నష్టపోయిన పంటలకు కూడా కనీస మద్దతు ధరకే వరిని కొనుగోలు చేసేందుకు ప్రభుత్వ సిద్దంగా ఉందని ఆయన తెలిపారు.

## 'ఎంఎస్‌పి'కే కొంటాం

(3వ పేజీ తరువాయి)

ఎలాంటి లోపాలు లేవని, గత రెండు రోజుల్లో ప్రకృతి వైపరిత్యం వల్ల స్టం జరిగిందన్నారు. రైతులు ఏ విధంగా నష్టపోయిన వారికి నష్ట పరిహారం అందిస్తామని తెలిపారు. పిడుగు పడి చనిపోయిన వారికి కూడా ఎక్స్‌గ్రేషియా ఇస్తామని చెప్పారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో బుధవారం మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. రాష్ట్రం అంతటా ఒకటే సారి వరి కోతలు జరగవని, ఒక్కో ప్రాంతంలో ఒక్కో సారి వరి కోతలు ఉంటాయని, కానీ తామయు ఒక్కసారి రాష్ట్రం అంతట కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి ఘూన్యం కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. గత ఏడాది ఇదే సమయానికి 13.77 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారని, గతంలో కంటే ఈసారి రెట్టింపుగా 24.85 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేశారని తెలిపారు. కర్ణాటక ప్రభుత్వంమన రాష్ట్రంకి తాగు నీటి కోసం2.25టిఎంసిఇస్తున్నారనిమంత్రి తెలిపారు.

**బిజెపి, బిఆర్ఎస్ కలిసి రైతుబంధు నిలిపివేయించాయి**

బిజెపి, బిఆర్ఎస్ కలిసి రైతులకు రైతుబంధు నిలిపివేయించారని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి విమర్శించారు. గతంలో ఎన్నికల సందర్భంగా పోలింగ్ బూత్‌లలో నిలపడ్డప్పుడు రైతుబంధు రైతులకు వచ్చిందని, అప్పుడు బిజెపి వారు ఎందుకు ఫిర్యాదు చేయలేదని ప్రశ్నించారు.

**2019 బ్యారేజ్‌లో డ్యామేజ్ కనపడింది**

కాళేశ్వరం ప్రాజెక్టులో బాఘంగా నిర్మించిన మేడిగడ్డ బ్యారేజ్‌లో డ్యామేజ్ 2019లో కనపడిందని ఎన్‌డిఎస్‌ఎ వారు చెప్పారని, అప్పుడే నీళ్ళు తొలగించి మరమ్మతులు చేస్తే బాగుండేదని వారి నివేదికలో పొందు పర్చారని మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి చెప్పారు. ఇప్పుడు బ్యారేజ్‌లలో నీళ్ళు ఉంచకూడదని చెప్పారని, ఆ కట్టడం భవిష్యత్‌పై కొంత గ్యారంటీ లేదన్నారు. ఎన్‌డిఎస్‌ఎ పూర్తి నివేదిక వారం రోజుల్లో వస్తుందని, నివేదిక అందిన తరువాత పూర్తి వివరాలు వెల్లడిస్తామని మంత్రి చెప్పారు. బ్యారేజ్‌కు సంబంధించిన అన్ని పరీక్షలు చేస్తున్నారన్నారు.

**నిమిషం కూడా కరెంట్ పోవడంలేదు**

రాష్ట్రంలో నిమిషం కూడా కరెంట్ పోవడంలేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలో కెసిఆర్ జెనరేటర్ కరెంట్‌పై సరఫరాపై ప్రెస్ మీట్ పెట్టాడని, జెనరేటర్ కరెంట్‌పై సరఫరాపై ప్రెస్ మీట్ పెట్టి కరెంట్ పోయిందంటే ప్రభుత్వం బాధ్యత వహిస్తుందా అని ఆయన ప్రశ్నించారు.

**బిఆర్ఎస్‌కు సున్నా సీట్లు వస్తాయి**

లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్ఎస్‌కు సున్నా సీట్లు వస్తాయని, కాంగ్రెస్ పార్టీకి మెజార్టీ సీట్లు వస్తాయని ఉత్తం కుమార్‌రెడ్డి అన్నారు. తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రధాని మోడీ నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని ఉత్తం కుమార్‌రెడ్డి అన్నారు. అదానీ,అంబానీల కోసం మోడీ పనిచేస్తున్నారని ఆయన ఆరోపించారు. ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే గురువారం, శుక్రవారాల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటారని, ఇప్పటికే క్రిటికల్ సీట్లలో సిఎం రేవంత్‌రెడ్డి ప్రచారం చేస్తున్నారని అన్నారు. దేశం మొత్తంలో కాంగ్రెస్‌కు ఎక్కువ మెజారిటీ సీట్లు ఉమ్మడి నల్గొండ జిల్లాలో వస్తాయన్నారు. బిజెపికి గత ఎన్నికల కంటే తక్కువ సీట్లు వస్తాయని, బిజెపికి చార్ సౌ పార్ కాదు కదా 200 వచ్చుడు కూడా కష్టమే అన్నారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తుందని, జూన్ 9 వ తేదీన రాహుల్ గాంధీ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేస్తారన్నారు. గతంలో ప్రజాస్వామ్యయుతంగా కాంగ్రెస్ పాలన జరిగిందని, బిజెపి పాలనలో అప్రజాస్వామ్యంగా పాలన కొనసాగుతున్నదని ఆయన విమర్శించారు.

## కట్టుబడి ఉన్నాం

(3వ పేజీ తరువాయి)

కాంగ్రెస్ తాను ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయలేదని అన్నారు. మహిళలకు రూ.2500 వచ్చాయా అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అనధికారికంగా డబుల్ ఆర్ ట్యాక్స్ అమలు అవుతున్నదని ఒకటి హైదరాబాద్‌కు, మరొకటి డిల్లీకి చేరుతున్నదన్నారు. తెలంగాణ రైతులకు 40 లక్షల మందికి కిషాన్ సమ్మాన్ నిధిని అందిస్తున్నామని, రికార్డు స్థాయిలో ధాన్యం కొనుగోళ్లు చేపట్టామని చెప్పారు. వరంగల్‌లో టెక్స్‌టైల్ పార్కు ఇచ్చామని, రామగుండం ఎరువుల ఫ్యాక్టరీ తెరిపించామని, పసుపు రైతులకు పసుపు బోర్డు తెచ్చామని అన్నారు. కాగా వరంగల్ సభలో ప్రసంగించిన మోడీ తెలంగాణ విభజన సమయంలో ఇచ్చిన హామీలపై మాత్రం మాట్లాడలేదు. ఈ సభలో వరంగల్ ఎంపి అభ్యర్థి ఆరూరి రమేష్, మహబూబాబాద్ ఎంపి అభ్యర్థి అజ్మీరా సీతారాం నాయక్, బిజెపి జాతీయ, రాష్ట్ర నాయకులు మాజీ ఎంపి గరికపాటి మోహన్ రావు, పొంగులేటి సుధాకర్ రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు మార్తినేని ధర్మారావు, కొండేటి శ్రీధర్, వరంగల్, హన్మకొండ జిల్లాల అధ్యక్షులు గంటా రవికుమార్, రావు పద్మ రెడ్డి, డాక్టర్ పగడాల కాళీ ప్రసాద్, ఎర్రబెల్లి ప్రదీప్ రావు, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్, బిఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధం**

వేములవాడలో నిర్వహించిన 'ఎములాడ జన సభ'లో మోదీ మాట్లాడుతూ అవినీతిలో కాంగ్రెస్, బిఆర్ఎస్‌ది ఫెవికాల్ బంధమని ప్రధాని మోదీ విమర్శలు చేశారు. ప్రజల ముందు ఒకరిపై ఒకరు అవినీతి ఆరోపణలు చేసుకుంటారు, తెర వెనుక మాత్రం బిఆర్ఎస్, కాంగ్రెస్ అవినీతి సిండికేట్‌గా మారుతారని ఆరోపించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు ఓటుకు నోటు కేసు నమోదైందని తెలిపారు. కాళేశ్వరం ప్రాజెక్టులో కుంభకోణం జరిగిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కాంగ్రెస్ చెబుతోందన్నారు. కానీ అధికారంలోకి వచ్చాక కాళేశ్వరం అవినీతిపై దర్యాప్తు చేయట్లేదని ప్రశ్నించారు. 'తెలంగాణ నుంచి ఢిల్లీ వరకు ఆర్ఆర్ ట్యాక్స్‌పైనే చర్చ జరుగుతోంది. దీని గురించి ప్రతి పిల్లవాడికీ తెలుసు. తెలుగులో ఆర్ఆర్ఆర్ సినిమా వచ్చింది. ఆర్ఆర్ఆర్ సినిమా కంటే ఆర్ఆర్ ట్యాక్స్ వసూళ్లు మించిపోయాయి. తెలంగాణలోని ఆర్ లూటీ చేసి ఢిల్లీలోని ఆర్‌కు ఇస్తున్నారు. ఈ ఆర్ఆర్ ఆటను ప్రజలు గమనిస్తున్నారు. ఐదేళ్లుగా అంబానీ, అదానీ పేర్లు జపం చేసిన కాంగ్రెస్ ఒక్కసారిగా ఆపేసింది. ఎన్నికల ప్రకటన రాగానే అంబానీ, అదానీపై విమర్శలు మానేసింది. అంబానీ, అదానీ జపం మానడం వెనక రహస్యాన్ని కాంగ్రెస్ ప్రజలకు చెప్పాలని' ప్రధాని మోదీ నిలదీశారు. 'కాంగ్రెస్, బిఆర్ఎస్‌తో ఎంఐఎంకు సత్సంబంధాలు ఉన్నాయి. 'హైదరాబాద్‌ను కాంగ్రెస్, బిఆర్ఎస్ ఎంఐఎంకు లీజుకు ఇచ్చింది. హైదరాబాద్‌లో బలమైన అభ్యర్థిని బిజెపి నిలబెట్టడం వల్ల ఎంఐఎంకు వణుకు పుట్టింది. ఎంఐఎం గెలిచేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ కృషి చేస్తున్నాయి' అని అన్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో ఎన్నికలు పూర్తయ్యాయని, మూడు విడతల్లో జరిగిన ఎన్నికల్లో ఇండియా కూటమికి పరాభవమే కలుగుతుందని మోదీ ధీమా వ్యక్తం చేశారు. మిగిలిన నాలుగు విడతల్లోనూ బిజెపి, ఎన్‌డిఎ కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు ప్రజలు సన్నద్ధమయ్యారని చెప్పారు. కరీంనగర్‌లో బండి సంజయ్ విజయం ముందే నిర్ణయమైందని జోస్యం చెప్పారు. ఈ నియోజకవర్గంలో ఎవరికీ తెలియని అభ్యర్థిని కాంగ్రెస్ బరిలోకి దింపినప్పుడే కరీంనగర్‌లో ఆ పార్టీ ఓటమి ఖాయమైందని వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ ప్రభావం కరీంనగర్‌లో మచ్చుకైనా కనిపించట్లేదన్నారు.

## గవర్నర్, ప్రభుత్వానికి కాగ్ రిపోర్టు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వ పద్దులపై భారత కంప్ట్రోలర్ ఆడిటర్ జనరల్ ఆధ్వర్యంలో రూపొందించిన ఆడిట్ నివేదికలను (కాగ్ రిపోర్ట్) శాసనసభ, శాసనమండలిలలో ప్రవేశపెట్టుందుకుగాను రాష్ట్ర గవర్నర్‌తో పాటు ప్రభుత్వానికి సమర్పించినట్లు అకౌంటెంట్ జనరల్ (తెలంగాణ రాష్ట్రం) పి.మాధవి తెలిపారు. 2021 2022 ఆర్థిక సంవత్సరానికి రెవెన్యూ సెక్టారు కార్యకలాపాలకు సంబంధించిన పద్దులు, లావాదేవీలపై ఆడిట్, పరిశీలనలు అదేవిధంగా రెవెన్యూ సెక్టార్‌పై ఆడిట్ నివేదిక (2024)తో పాటు 2022 23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి తెలంగాణ ప్రభుత్వ ఆర్థిక స్థితిగతులు, పద్దులు, బడ్జెట్ ప్రక్రియలపై ఆడిట్, పరిశీలనలు 2024లో రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ఆడిట్ నివేదికలను అందజేసినట్లు ఆమె ఒక ప్రకటనలో వివరించారు.

